తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 15 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 286 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## రైతుల సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాసిన హరీష్

- రిజర్వాయర్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపణ
- కాలువల భూసేకరణకు రూ.30 కోట్లు కేటాయించాలని డిమాండ్
- కొత్త ఆయకట్టు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్య



2లో

## పెళ్లికి నిరాకరించిందని యువతికి ఎయిడ్స్ రక్తం ఇంజెక్ట్ చేసిన యువకుడు

- పోచారంలో దారుణ ఘటన
- వివాహం నిరాకరించడంతో కక్ష తీర్చుకున్న నిందితుడు
- నిందితుడు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



2లో

### గ్యాస్ కొరతతో హాస్టళ్లలో

# కట్టెల పొయ్యిలపై వంట



### హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో పొగ దట్టం

### కమర్షియల్ సిలిండర్ల కొరతతో ఇబ్బందులు

### కొన్ని పీజీలలో టిఫిన్ సేవలు నిలిపివేత

**హైదరాబాద్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఉన్న పీజీలు, హాస్టళ్లలో వంటలు చేసేందుకు గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో నిర్వాహకులు కట్టెల పొయ్యిలను ఉపయోగించడం ప్రారంభించారు. ఈ పరిస్థితి కారణంగా భవనాల మధ్య నుంచి భారీగా పొగ వ్యాపిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా అనేక పీజీలు, హాస్టళ్లలో సాధారణ వంటలు చేయడం కూడా కష్టంగా మారింది. దీంతో నిర్వాహకులు తాత్కాలికంగా కట్టెల పొయ్యిలపై వంటలు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ విధంగా వంట చేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో పొగ వ్యాపించి స్థానికులకు అసౌకర్యం కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఉన్న భవనాల మధ్య నుంచి పొగ ఎగిసి పడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశంగా మారాయి. గ్యాస్ కొరత ప్రభావం వల్ల కొన్ని పీజీలు, హాస్టళ్లలో టిఫిన్ సేవలు కూడా నిలిచిపోయాయి. గ్యాస్ వినియోగాన్ని తగ్గించేందుకు కొంతమంది నిర్వాహకులు పరిమితంగా మాత్రమే వంటలు చేస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతాల్లో భోజన ఏర్పాట్లపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇక పరిస్థితి సాధారణ స్థితికి రావాలని హాస్టల్ నిర్వాహకులు, నివాసితులు కోరుతున్నారు. గ్యాస్ సరఫరా సమస్య త్వరగా పరిష్కారమైతే మాత్రమే హాస్టళ్లలో సాధారణ వంట ఏర్పాట్లు పునరుద్ధరించవచ్చని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం నగరంలో గ్యాస్ కొరతపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాట్ల పరిశీలన

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈనెల 22న ప్రారంభం**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**పరిశ్రమ ప్రారంభానికి అధికారులు వేగంగా ఏర్పాట్లు**



2లో

## రూ.10 కోట్లతో 2 లేన్ రహదారి 4 లేన్లుగా విస్తరణ

**హయత్‌నగర్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కీలక అడుగు**

**ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



2లో

## గ్రామ పంచాయతీలకు మరో రూ.640 కోట్లు విడుదల



**15వ ఆర్థిక సంఘం నిధుల బకాయిలు పూర్తిగా చెల్లింపు**

**2025–26 నిధులు త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి**

**గ్రామాభివృద్ధికి నిధులు కీలకం: మంత్రి సీతక్క**

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతుల సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాసిన హరీష్ రావు

**సిద్దిపేట, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):**



కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన రిజర్వాయర్ల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల అభివృద్ధి పనులు గత రెండేళ్లుగా నిలిచిపోయాయని లేఖలో పేర్కొన్నారు. 2020 నుంచి 2023 మధ్య కాలంలో ఈ రిజర్వాయర్ల ద్వారా ప్రధాన మరియు డిస్ట్రిబ్యూటరీ కాలువలను పూర్తి చేసి సిద్దిపేట జిల్లాలో సుమారు లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించామని హరీష్ రావు తెలిపారు. ప్రతి యాసంగి కాలంలో కాలువల ద్వారా చెరువులు, కుంటలు, వాగులు, చెక్‌డ్యామ్‌లు మరియు నేరుగా ఆయకట్టుకు నీరు అందించడంతో రైతులకు ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. దీని వల్ల పంట దిగుబడులు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిందని ఆయన విమర్శించారు. గత 27 నెలలుగా రిజర్వాయర్ల అభివృద్ధికి సంబంధించి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, ఈ కాలంలో ఒక్క గజం కాలువ కూడా తవ్వలేదని హరీష్ రావు పేర్కొన్నారు. మైనర్ మరియు సబ్ మైనర్ కాలువల నిర్మాణానికి భూసేకరణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై పలుమార్లు లేఖల ద్వారా, ఫోన్ ద్వారా మరియు వ్యక్తిగతంగా కూడా మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన "తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు" అనే నినాదం సిద్దిపేట జిల్లాలో అమలు చేసే అవకాశం ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వల్ల అది సాధ్యం కావడం లేదని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అన్నపూర్ణ (అంతగిరి) రిజర్వాయర్ ప్యాకేజ్-10 కోసం రూ.15 కోట్లు, రంగనాయకసాగర్ ప్యాకేజ్-11 కోసం రూ.15 కోట్లు కేటాయించాలని హరీష్ రావు లేఖలో కోరారు. మొత్తం రూ.30 కోట్లు కేటాయిస్తే భూసేకరణ పూర్తయ్యి అదనంగా లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొత్త ఆయకట్టు పనులు ముందుకు సాగడం లేదని హరీష్ రావు విమర్శించారు. వేలాది మంది రైతులు ఈ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని, వెంటనే కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం నిధులు మంజూరు చేయాలని రైతుల తరపున ఆయన విజ్ఞప్తి చేశారు.

# గ్రామ పంచాయతీలకు మరో రూ.640 కోట్లు విడుదల

**హైదరాబాద్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు మరో రూ.640 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే ఒక విడతగా రూ.640 కోట్లు విడుదల చేసిన కేంద్రం, తాజా విడతతో కలిపి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు వెల్లడైంది. ఈ నిధులు గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన యుటిలిటీ సర్టిఫికెట్లు మరియు ఇతర నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమయానికి అందజేస్తున్నందున నిధుల విడుదల వేగవంతమైందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను పారదర్శకంగా అమలు చేస్తున్నందుకు గుర్తింపుగా కేంద్రం ఈ నిధులను విడుదల చేసిందన్నారు. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సుమారు రూ.1,255 కోట్లు ఇంకా కేంద్రం నుంచి రావాల్సి ఉందని మంత్రి తెలిపారు. గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ఆ నిధులు అత్యంత అవసరమని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను కూడా త్వరితగతిన విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు. 15వ ఆర్థిక సంఘం గడువు మరో 15 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో మిగిలిన నిధులను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నిధులు సమయానికి అందితే గ్రామ స్థాయిలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతాయని తెలిపారు. ఇప్పటివరకు కేంద్రం విడుదల చేసిన నిధులను నిబంధనలకు అనుగుణంగా గ్రామ పంచాయతీల్లో వినియోగిస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పనులకు ఇప్పటికే చేపట్టిన వ్యయాలకు అనుగుణంగా బిల్లులు చెల్లిస్తామని వెల్లడించారు. గ్రామ పంచాయతీల బలోపేతం ద్వారా గ్రామీణాభివృద్ధి వేగవంతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి మిగిలిన నిధులను త్వరగా విడుదల చేస్తే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగం అందుకుంటాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాట్ల పరిశీలన

**సిద్దిపేట, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభించనున్న నేపథ్యంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఫ్యాక్టరీ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న పనుల గురించి వివరాలు తెలుసుకున్న మంత్రి, ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఫ్యాక్టరీ ప్రారంభానికి అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. నర్మెట్టలో ఏర్పాటైన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రాంతీయ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం లభించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం అందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ ప్రారంభం తర్వాత స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. రైతులు పండించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని తెలిపారు. రైతులు పండించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని తెలిపారు.

# రూ.10 కోట్లతో 2 లేన్ రహదారి 4 లేన్లుగా విస్తరణ

**హైదరాబాద్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ప్రాంతంలో రహదారి విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 2 లేన్ రహదారిని 4 లేన్ రహదారిగా విస్తరించే అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ రహదారి విస్తరణతో స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగర పరిధి విస్తరిస్తున్న కొద్దీ వాహనాల రాకపోకలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న ఈ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రజలకు సురక్షితమైన ప్రయాణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రహదారి విస్తరణ పూర్తయిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు సమయం ఆదా కావడంతో పాటు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని తెలిపారు.

ప్రస్తుతం హైదరాబాద్ నగరం దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా నిలుస్తోందని మంత్రి అన్నారు. ఈ అభివృద్ధికి అనుగుణంగా మౌలిక వసతులను కూడా బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సదుపాయాలు, ప్రజా సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. హయత్‌నగర్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు ఇలాంటి ప్రాజెక్టులు ఎంతో అవసరమని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో నగర పరిసర ప్రాంతాల్లో మరిన్ని రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన మరియు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నగర అభివృద్ధి వేగానికి అనుగుణంగా అన్ని రంగాల్లో మౌలిక వసతులను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో కోడిగుడ్డు ధరలు భారీగా పతనం

**హైదరాబాద్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల ప్రభావం దేశంలోని పలు రంగాలపై కనిపిస్తుండగా కోడిగుడ్డు మార్కెట్‌పై కూడా దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా భారతదేశం నుండి గల్ఫ్ దేశాలకు గుడ్ల ఎగుమతులు నిలిచిపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో గుడ్ల ధరలు గణనీయంగా పడిపోయాయి. దీంతో వ్యాపారులు, కోళ్ల పెంపకదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రతిరోజూ లక్షల సంఖ్యలో గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి గల్ఫ్ దేశాలకు భారీగా గుడ్లు ఎగుమతి అవుతాయి. సాధారణంగా ప్రతిరోజూ దాదాపు వంద మిలియన్లకు పైగా గుడ్లు విదేశాలకు పంపబడుతాయి. అయితే ప్రస్తుత యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఎగుమతులు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో నిల్వలు పెరిగి ధరలు పడిపోతున్నాయి. ఇక ముస్లింల పవిత్ర మాసమైన రంజాన్ ప్రారంభం కావడంతో వినియోగం కూడా కొంత తగ్గింది. తక్కువ డిమాండ్, అధిక ఉత్పత్తి కలిసి ధరలు పడిపోవడానికి కారణమయ్యాయి. రెండు నెలల క్రితం రూ.8 వరకు ఉన్న ఒక్క గుడ్డు ధర ఇప్పుడు రూ.3.50 నుంచి రూ.3.80 వరకు పడిపోయింది. రాష్ట్రంలో ప్రతిరోజూ సుమారు 35 మిలియన్ గుడ్లు ఉత్పత్తి అవుతాయి. రాష్ట్ర వార్షిక గుడ్ల ఉత్పత్తి విలువ దాదాపు రూ.18,600 కోట్లుగా ఉంది. సాధారణంగా ఏడాది పొడవునా ఒక్క గుడ్డు ధర రూ.5 నుంచి రూ.6 మధ్య ఉండగా ప్రస్తుతం ధరలు భారీగా తగ్గడంతో ఉత్పత్తిదారులకు ఒక్క గుడ్డుకు సుమారు రూ.1.50 వరకు నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో డజన్ గుడ్ల ధర సుమారు రూ.50 వరకు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా దాదాపు ఇదే ధర కొనసాగుతోంది.

# పెళ్లికి నిరాకరించిందని యువతికి ఎయిడ్స్ రక్తం ఇంజెక్ట్ చేసిన యువకుడు

**హైదరాబాద్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగర పరిధిలోని పోచారం ప్రాంతంలో అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. పెళ్లికి నిరాకరించిందనే కోపంతో ఓ యువకుడు యువతిపై దారుణానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. యువకుడు మనోహర్ అనే వ్యక్తి యువతికి ఎయిడ్స్ ఉన్న రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, బాధిత యువతికి మనోహర్‌తో వివాహం నిశ్చయమైంది. అయితే అనంతరం మనోహర్‌కు ఎయిడ్స్ ఉన్నట్లు యువతికి తెలిసింది. దీంతో ఆమె ఆ వివాహానికి నిరాకరించినట్లు సమాచారం. ఈ విషయం మనోహర్‌కు ఆగ్రహం కలిగించడంతో యువతిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 11న యువతి ఇంటికి వెళ్లిన మనోహర్, మరోసారి పెళ్లి విషయంపై మాట్లాడే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. యువతి మరోసారి వివాహానికి నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన మనోహర్ ఆమెకు ఎయిడ్స్ ఉన్న రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనతో యువతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి నిందితుడు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బాధిత యువతికి వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.




# ఇండో–అమెరికా ఒప్పందంపై నిరసన దీక్షలో మంత్రి సీతక్క

- **ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆందోళన**
- **దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన ఒప్పందాలను పునఃపరిశీలించాలని డిమాండ్**
- **ప్రజల హక్కుల కోసం యువత పోరాటం అభినందనీయం**

**న్యూఢిల్లీ, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):**

ఇండో-అమెరికా ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలోని ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన నిరసన దీక్షలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే ఏ ఒప్పందాన్నైనా కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. భారతదేశ స్వావలంబనను కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని, రైతులు, కార్మికులు మరియు సాధారణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. దేశ ప్రయోజనాలు, ప్రజల హక్కులను కాపాడే విషయంలో యువత ముందుండి పోరాడటం అభినందనీయమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాలను వ్యక్తపరచే హక్కు ఉందని ఆమె తెలిపారు.

ఈ నిరసన కార్యక్రమంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకునే నిర్ణయాలు ప్రజలకు మేలు చేసేలా ఉండాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# బీజేపీలో చేరిన పాతబస్తీ యువత

- **రాష్ట్ర కార్యాలయంలో భారీగా పార్టీలో చేరికలు**
- **ప్రధాని మోదీ పాలనకు ఆకర్షితులై చేరిక**
- **యువతకు స్వాగతం పలికిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాం చందర్ రావు**

**హైదరాబాద్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో భారతీయ జనతా పార్టీలో చేరారు. రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాం చందర్ రావ్ సమక్షంలో యువత పార్టీ కండువాలు ధరించి అధికారికంగా పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన యువతకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పాతబస్తీ ప్రాంతానికి చెందిన యువత పెద్ద ఎత్తున బీజేపీలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్ రాం చందర్ రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు యువతను ఆకర్షిస్తున్నాయని అన్నారు. సుపరిపాలన, పారదర్శకత మరియు అభివృద్ధి అనే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో మోదీ నాయకత్వం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. పాతబస్తీ ప్రాంత అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని ఎన్ రాం చందర్ రావు తెలిపారు. నగరంలోని పాతబస్తీ ప్రాంతంలో మౌలిక వసతులను మెరుగుపరచడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం మరియు సమగ్ర అభివృద్ధి సాధించడం కోసం పార్టీ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. నవ భారత నిర్మాణంలో యువత పాత్ర అత్యంత ముఖ్యమని ఎన్ రాం చందర్ రావు పేర్కొన్నారు. బీజేపీలో చేరిన యువత పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. సమాజాభివృద్ధి కోసం యువత ముందుకు రావాలని, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందిన జన్ను వెంకటరమణకు ఘన సత్కారం



**వనపర్తి,మార్చి14(తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తమ అధికారులు తమ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వనపర్తికి చెందిన రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన జన్ను వెంకటరమణను శనివారం సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఆయన స్వగృహంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ వెంకటరమణ 37 సంవత్సరాల పాటు ఉత్తమ అధికారిగా నిష్కళంకంగా విధులు నిర్వర్తించి ఎక్కడా ఎలాంటి ఆరోపణలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు పొందారని కొనియాడారు. ఆయన సేవా జీవితం అనేక మందికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, ఆర్డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, గంధం నాగరాజు, గ్రామభారతి నిర్వాహకుడు కరుణాకర్ గౌడ్, శ్రీలక్ష్మి, అరుణ, మింటూ, కల్పన, ముబీన, దివ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాల పంపిణీ




**నాగారం, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగారం డివిజన్‌లో ఉన్న మసీదులో ముస్లిం సోదర సోదరీమణులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు అవసరమైన రంజాన్ కానుకలను అందజేశారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీవుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ తోఫాలను పంపిణీ చేశారు. నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదర భావం, పరస్పర సహకారం మరియు సేవా భావానికి ప్రతీక అని పేర్కొన్నారు. ముస్లిం సోదర సోదరీమణులు శాంతి, సౌభ్రాతృత్వంతో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు పంగ హరిబాబు, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు అశోక్ గౌడ్, కొండల్ రెడ్డి, సతీష్ గౌడ్, జీవన్ రెడ్డి, పర్వత్ రెడ్డి, మంచాల ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మైనారిటీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కమలానగర్‌లో కార్ల్ మార్క్స్, ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ సంస్మరణ సభ



**కాప్రా, మార్చ్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం కమలానగర్ కార్యాలయంలో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త కార్ల్ మార్క్స్ 143వ వర్ధంతి, ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 147వ జయంతి, ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ 8వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ముందుగా కార్ల్ మార్క్స్ చిత్రపటానికి సామాజిక ఉద్యమ నాయకులు సత్యం పూలమాల వేసి నివాళులర్పించారు. ఐన్‌స్టీన్ చిత్రపటానికి సామాజిక ఉద్యమ నేత జయరాజు, స్టీఫెన్ హాకింగ్ చిత్రపటానికి ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ ప్రపంచవ్యాప్తంగా సామాజిక మార్పుకు దారి చూపిన గొప్ప తత్వవేత్త అని పేర్కొన్నారు. సమాజంలోని వర్గ విభజనలను విశ్లేషించి కార్మిక వర్గ హక్కుల కోసం పోరాట మార్గాన్ని సూచించిన మహనీయుడని తెలిపారు. అలాగే ఐన్‌స్టీన్ రూపొందించిన సాపేక్ష సిద్ధాంతం శాస్త్ర ప్రపంచానికి కొత్త దారులు చూపిందని, స్టీఫెన్ హాకింగ్ తన శారీరక పరిమితుల మధ్య కూడా విశ్వ రహస్యాలపై గొప్ప పరిశోధనలు చేసి ప్రపంచానికి మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు.అటువంటి మహనీయుల ఆలోచనలు సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని నాయకులు తెలిపారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, లక్ష్మయ్య, నరసయ్య, వెంకటేష్, శోభ, గౌసియా, శారద, అనురాధ, నారాయణరావు, బంగారు నర్సింగరావు, ఉమామహేశ్వరరావు, సత్య, ఆర్.ఎస్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**భీమదేవరపల్లి, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టుతూ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి శనివారం పలు పనులను ప్రారంభించారు. గ్రామంలోని శ్రీనివాస కాలనీలో చాలాకాలంగా మురుగు కాలువలు మరియు అంతర్గత రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి కాలనీవాసులకు నడిచే పరిస్థితి లేకపోవడం, రోజువారీ జీవనానికి ఆటంకం కలగడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.
ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సి.సి రోడ్డు నిర్మాణం మరియు మురికి నీటి కాలువల నిర్మాణ పనులను సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ప్రారంభించారు. ఈ పనులు పూర్తయిన తర్వాత కాలనీలో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు రవాణా సౌకర్యం కూడా సులభమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. గ్రామంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పంచాయతీ కృషి చేస్తుందని, ప్రజలకు అవసరమైన రోడ్లు, కాలువలు, పారిశుధ్య పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుంచు చంద్రమౌళి, గద్వాల సుకన్య, దొంతరబోయిన కోమల, పల్లె తిరుపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేసి ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.





# కాప్రా సర్కిల్‌లో మెగా ఈ–వేస్ట్ కలెక్షన్ ప్రారంభం

**కాప్రా, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా పాలన పట్టణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా ఈ-వేస్ట్ కలెక్షన్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు కాప్రా సర్కిల్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి పర్యవేక్షణలో సైనిక్పురి వార్డు కార్యాలయం, కాప్రా, ఏ.ఎస్.రావు నగర్, కుషాయిగూడ, ఈసీ నగర్ కమ్యూనిటీ హాల్‌లలో మొత్తం ఐదు కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఈ-వేస్ట్ సేకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 1633 కిలోల ఈ-వేస్ట్ సేకరించబడింది.కలెక్షన్ సెంటర్లతో పాటు వీధుల్లో మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ శానిటేషన్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఈ-వేస్ట్ సేకరించారు. సేకరించిన మెటీరియల్‌ను మున్సిపల్ కార్పొరేషన్ ఎంపిక చేసిన ఏజెన్సీలకు అప్పగించి, నిర్ణయించిన రేటు ప్రకారం యజమానులకు డబ్బులు చెల్లించనున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో RECO ఏజెన్సీ ద్వారా ఈ-వేస్ట్ మెటీరియల్‌ను డిస్పోజ్ చేయనున్నారు.ఈ కార్యక్రమం నేడు ఆదివారం కూడా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ సాలిడ్ మేనేజ్మెంట్ రవి, శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్లు సుధీర్, రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు వసంత లక్ష్మి, సంజీవ్, ఇన్‌చార్జ్ ఎస్ఎఫ్ఏ అంజలి తదితరులు మరియు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిమెంట్ రోడ్డు పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

**నాచారం, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ ఓల్డ్ విలేజ్‌లో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ శనివారం పర్యవేక్షించారు. స్థానిక ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించే ఉద్దేశంతో రూ.1.05 కోట్ల వ్యయంతో ఇప్పటికే పలు సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ఇంకా ఒక రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉండటంతో, ఆ రోడ్డు నిర్మాణ పనులను రూ.8 లక్షల వ్యయంతో ప్రారంభించినట్లు పేర్కొన్నారు.



ఈ సందర్భంగా జరుగుతున్న పనులను పరిశీలించి, నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు.అలాగే నాచారం ప్రాంతంలో త్వరలోనే దాదాపు రూ.7 కోట్ల వ్యయంతో మరిన్ని సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, ఈశ్వర్ గౌడ్, సాయిబాబా, ఎల్లేష్ తదితరులు మరియు బస్తీ వాసులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మేఘారెడ్డి భుజాలపై విట్ట శ్రీనివాస్ రెడ్డి అంతిమయాత్ర

- **కన్నీటి పర్యంతంగా కడసారి వీడ్కోలు పలికిన ప్రజలు, నాయకులు**

**పెద్దమందడి,మార్చి14(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సేవలో ప్రత్యేక గుర్తింపు పొందిన విట్ట శ్రీనివాస్ రెడ్డి అంతిమయాత్ర హృదయ విదారక వాతావరణంలో జరిగింది. పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో నిర్వహించిన ఆయన అంతిమయాత్రలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని, శ్రీనివాస్ రెడ్డి పాడెను భుజాలపై మోసి నివాళులర్పించారు.శ్రీనివాస్ రెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మేఘారెడ్డి శుక్రవారం రాత్రి అమ్మపల్లి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం శనివారం ఉదయం



10 గంటలకు మళ్లీ గ్రామానికి చేరుకుని అంతిమయాత్రలో పాల్గొన్నారు. మూడు నుండి నాలుగు గంటల పాటు అక్కడే ఉండి, ఆయన పాడెను భుజాలపై మోసి కన్నీటి పర్యంతమై చివరి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆస్తులను కంటే ఆప్తులను సంపాదించుకోవడమే నిజమైన జీవితమని శ్రీనివాస్ రెడ్డి అంతిమయాత్ర ప్రతి ఒక్కరికీ స్పష్టంగా చూపించిందని అన్నారు. ఆయన సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు, అభిమానులు, స్థానిక నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని శ్రీనివాస్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.అంతిమయాత్రలో భావోద్వేగభరిత వాతావరణం నెలకొంది.

ఆదివారం - 15 - మార్చి 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మానవత్వంతో ముందుకు వచ్చిన జె. వెంకటేష్ యాదవ్

- వృద్ధాశ్రమానికి 100 కిలోల బియ్యం, కూరగాయల అందజేత



**కీసర, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర సర్కిల్ డివిజన్-1 పరిధిలోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో జె. వెంకటేష్ యాదవ్ ముందుకు వచ్చారు. వృద్ధులకు అవసరమైన 100 కిలోల బియ్యంతో పాటు కొన్ని కూరగాయలను సెరినిటీ పాఠశాల పీ.ఈ.టి ద్వారా వృద్ధాశ్రమానికి అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ, జె. వెంకటేష్ యాదవ్ చేసిన సహాయం వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించి వృద్ధులకు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మచ్చాని రాజు యాదవ్, ముద్దం మల్లేష్ యాదవ్, ఆర్.సి.ఎం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులందరికీ పట్టణ ఉపాధి పథకం అమలు చేయాలి

- సిఐటియు నాయకులు డి.నగేష్ డిమాండ్



**కీసర, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా జవహర్ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో పనిచేస్తున్న అడ్డా కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు కార్మికులతో సమావేశం నిర్వహించినట్లు జవహర్ నగర్ సిఐటియు నాయకులు డి.నగేష్ తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, జవహర్ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, అడ్డా కార్మికులందరికీ బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కమిటీ నాయకులు బంగారు నర్సింగరావు మాట్లాడుతూ మహా నగరంలో అడ్డా కార్మికుల జీవితం ఎంతో దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చిన అనేక మంది కార్మికులు అడ్డాల వద్ద పని కోసం ఎదురు చూస్తూ జీవనం సాగిస్తున్నారని, పని దొరకక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేకంగా పట్టణ ఉపాధి పథకం రూపొందించి సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, అలాగే కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడం, మహిళల కోసం మూత్రశాలలు ఏర్పాటు చేయడం, వేసవిలో వాటర్ క్యాంపులు ఏర్పాటు చేయడం, తాత్కాలిక షెడ్లు నిర్మించడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు రూ.5 భోజన పథకం అమలు చేయడం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వడం, బేషరతుగా వెల్ఫేర్ బోర్డులో నమోదు చేసి సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడంతో పాటు 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.10,000 పింఛన్ అమలు చేయాలని కూడా కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు టి.శివన్నారాయణతో పాటు నాయకులు రాములు, కుమార్, వర్మ, నరసింహ, ఎల్లయ్య, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పవిత్రతను ప్రతిబింబించిన ఇఫ్తార్ విందు

- ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన నందిమల్ల త్రినాథ్



**వనపర్తి,మార్చ్14(తెలంగాణ ముచ్చట్లు):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండల కేంద్రంలోని మసీద్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకుడు అడ్వకేట్ నందిమళ్ళ త్రినాథ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందిమళ్ళ త్రినాథ్ ముదిరాజ్ హాజరై ముస్లిం సోదరులకు రమజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రమజాన్ మాసం ఉపవాసం, ప్రార్థనలు, దానం, సహనానికి ప్రతీకగా నిలిచే పవిత్ర కాలమని అన్నారు.సమాజంలో ప్రేమ, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం పెంపొందించడంలో ఇలాంటి ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు కలిసి పాల్గొనే ఈ కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని తెలిపారు.అదేవిధంగా మైనార్టీ సోదరులందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్ష విరమణలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి గ్రామ కాంగ్రెస్ నాయకులు సూర్య రవి, మాజీ జడ్పిటిసి సభ్యులు కొమ్ము వెంకటస్వామి, వార్డు సభ్యులు కొమ్ము సతీష్, ఆశన్న జ్యోతి, నీలం రవి, రఫీ, మాజీ ఉపసర్పంచ్ జావేద్, ప్రసాద్, మెడికల్ రఘు, వహీద్, మైనారిటీ సెల్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ



**కీసర, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిమ్మకాయల పెద్దిరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనసేన నాయకులు రవి రాజ్ రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఎప్పటికీ బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడే పార్టీ అని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని, ప్రజల మద్దతుతో పార్టీని బలోపేతం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వై రమేష్, జనసైనికులు, వీర మహిళలు మరియు పలువురు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ స్థాపక నాయకుడి ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమాన్ని కార్యకర్తలు ఉత్సాహభరితంగా నిర్వహించారు.

# శ్రీశైలం మల్లికార్జున నాటక ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

**పెద్దమందడి,మార్చి14(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో త్వరలో నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ శ్రీశైలం మల్లికార్జున నాటకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరుకావాలని నాటక కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ..గ్రామంలో ప్రతి ఏడాది భక్తి భావంతో శ్రీశైలం మల్లికార్జున నాటకాన్ని నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా భక్తుల సమక్షంలో ఘనంగా నాటక ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై ప్రారంభోత్సవం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పామిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు మంజుల శ్రీశైలం, మాజీ సర్పంచ్ తిక్కన్న, వార్డు సభ్యులు యాదయ్య గౌడ్, డోలు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.






# దళిత హక్కుల రక్షణ కోసం ఐక్య పోరాటం

- మార్చి 20న హనుమకొండలో జిల్లా మహాసభ

**స్టేషన్ ఘనపూర్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా రెండవ మహాసభను ఈ నెల 20వ తేదీన హనుమకొండలోని బాలసముద్రంలో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సమితి నాయకులు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మహాసభలను పురస్కరించుకొని ధర్మసాగర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, జిల్లా కార్యదర్శి రొంటాల దేవా మాట్లాడారు.

వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన ప్రభుత్వాలు ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్లు అమలు చేయడంలో సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రిజర్వేషన్ వ్యవస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితుల అభివృద్ధి కోసం కేటాయించాల్సిన 20 శాతం నిధులను ఇప్పటివరకు సరైన విధంగా కేటాయించలేదని తెలిపారు. కేటాయించిన కొద్దిపాటి నిధులను కూడా దళితుల అభివృద్ధికి వినియోగించకుండా ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు 76 సంవత్సరాల కాలంలో దళితులకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదని అన్నారు.

దళితులపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టలేక పోతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసుల్లో పోలీసు స్టేషన్లలో బెయిలు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటేనే దళితులపై దాడులు తగ్గుతాయని వారు డిమాండ్ చేశారు.

ఖాళీగా ఉన్న రిజర్వేషన్ ఉద్యోగాలను భర్తీ చేయడంలో కేంద్ర ప్రభుత్వ పనితీరు సంతృప్తికరంగా లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీలలో పేర్కొన్న “అంబేద్కర్ హస్తం” పథకం కింద దళితులకు 12 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఇప్పటివరకు అందలేదని తెలిపారు.

ఇందిరమ్మ గృహాల పథకంలో ఇల్లు లేని పేదలలో దాదాపు 80 శాతం మంది దళితులే ఉన్నారని పేర్కొన్నారు. కాబట్టి ఈ గృహాల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత దళితులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

మార్చి 20న జరగనున్న ఈ మహాసభకు మాజీ శాసనసభ్యుడు పోతరాజు సారయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్ర బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేస్, జిల్లా నిర్మాణ బాధ్యులు కొట్టపాక రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో ధర్మసాగర్ మండల దళిత హక్కుల పోరాట సమితి కార్యదర్శి రాజారపు రత్నం, భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, గ్రామ కార్యదర్శి చిలుక బాబు, సీనియర్ నాయకులు దోకి రాజయ్య, వల్లపు సారయ్య, వల్లపు వెంకన్న, రాస మల్ల కుమార్, బొడిగె కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రాలో ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాల పంపిణీ




**కాప్రా, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాలను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. శనివారం కాప్రా పరిధిలోని ఏ.ఎస్. రావు నగర్ డివిజన్‌లో డి.ఎ.ఇ కాలనీ జామా మసీదు మరియు హెచ్.బి కాలనీ డివిజన్ కృష్ణానగర్ కాలనీ మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ కానుకలను అందజేశారు.

ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ సౌభ్రాతృత్వం, సేవా భావానికి ప్రతీక అని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, ఐక్యతతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ధనపాల్ రెడ్డి, బొంతు శ్రీదేవి, సీతారాం రెడ్డి, అంజి రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్, విట్టల్ నాయక్, నాగిళ్ల బాల్ రెడ్డి, పెద్ది నాగరాజ్, పెద్ది శ్రీను, అజీజ్, బత్తుల శ్రీకాంత్, శ్రీకాంత్ రెడ్డి, బాషా, లింగం, మల్లారెడ్డి, ప్రకాష్ రెడ్డి, నరేందర్, సంతోష్ చారి, క్రాంతి, టిల్లు, గోపాల్ యాదవ్, చౌదరి, గుణ శేఖర్, రాజు, హీరాలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే హెచ్.బి కాలనీ డివిజన్ మజీద్ కమిటీ సభ్యులు సలీమ్, తాహెర్, పాషా, అక్బర్ పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్యతో పాటు కప్రా సాయికిరణ్ గౌడ్, రాయని ఉదయ్ కిరణ్, శ్రీనివాస్ ముదిరాజ్, అనిల్ గుప్తా, సుబ్బు, సురేష్ గౌడ్, వెంకట్, అప్పరో, మల్లేష్, సమయ, గణేష్, రమేష్, జోష్, మూసాల శ్రీనివాస్ రెడ్డి, రూపేందర్ రెడ్డి, కృష్ణ నాయక్, ముజీబ్, జానీ బాయ్, బాలరాజు హాజరయ్యారు.

# కాశీ యాత్రకు ప్రత్యేక బస్సు



**కుషాయిగూడ, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపో నుండి కాశీ యాత్రకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు సౌకర్యంగా హైదరాబాద్ నుంచి పలు ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించేలా ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.ఈ యాత్రలో భాగంగా ఉజ్జయిని మహంకాళి, ఓంకారేశ్వర్, శారద శక్తిపీఠం, అయోధ్య, ప్రయాగ్రాజ్, కాశీ వంటి పవిత్ర క్షేత్రాలను భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ ప్రత్యేక బస్సు మార్చి 28న సాయంత్రం 6 గంటలకు ఈసీఐఎల్ బస్టాండ్ నుండి బయలుదేరనుంది.
ఈ యాత్రకు టికెట్ ధర రూ.8,000గా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. యాత్రలో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్: 9959226145, 9603549388 నంబర్లను సంప్రదించాలని కోరారు.




# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తాడూరి శ్రీనివాస్ నియామకం

◆ **డా. ఏఎస్ రావు నగర్ డివిజన్‌కు గర్వకారణమని నాయకుల అభినందనలు**

**కాప్రా, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా (స్పోక్స్ పర్సన్) నియమితులైన తాడూరి శ్రీనివాస్‌కు స్థానిక నాయకులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్‌కు చెందిన కమలానగర్ నివాసి తాడూరి శ్రీనివాస్ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర తొలి ఎంబీసీ చైర్మన్‌గా పనిచేసిన ఆయన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులవడం డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ ప్రజలకు గర్వకారణమని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మర్రి మోహన్ రెడ్డి, కె. రమేష్ యాదవ్, దొంతుల ప్రభాకర్, ఏనుగు సీతారాం రెడ్డి, వెంకన్న నాయక్, సుధాకర్, టి. మాధవరావు, డాక్టర్ వెంకటరమణాచారి, ప్రేమ్ గౌడ్, హరినాథ్ గౌడ్, ఏనుగు మంజుల, పుష్పలత, శ్రీకాంత్, శ్రీహరి, బద్దం సుధాకర్ రెడ్డి, జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చింతలపల్లెలో ఘనంగా తొలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**ఎల్కతుర్తి, మార్చ్ 14 (తెలంగాణ ముచ్చట్లు) :** ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లె గ్రామంలో తొలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ హాజరై గృహప్రవేశాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బుసరి రామారావు - రమ దంపతులు తమ సొంత ఇంటిలోకి అడుగుపెట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుకినే సంతాజీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేద కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని, ప్రతి పేదవాడి ఇంటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు లభించడం తమ కుటుంబానికి ఎంతో సంతోషకరమైన విషయమని లబ్ధిదారులు బుసరి రామారావు, రమ తెలిపారు. తమ సొంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని వారు ఆనందం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో హింగే సంతాజీ, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, లోలేట చిరంజీవి, అంబీరు గోపాల్, కుడితాడి మహేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామంలో తొలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం జరగడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.

# ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాలను పంపిణీ






**ఉప్పల్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉప్పల్‌లో ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఉప్పల్ కుతుబ్షాహీ పెద్ద మసీదులో నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొని తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఖాజా మౌలానా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంజాన్ పర్వదినం సోదరభావం, శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, ఈగ అంజయ్య ముదిరాజ్, బజార్ జగన్నాథ్ గౌడ్, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, బూసం రఘునాథ్ రెడ్డి, అస్లాం, అజ్జు, అల్లా భాషా, జలీల్, కాసిం, ఆసిఫ్, అన్వర్ పాషా, అఫ్జల్, ఇషాద్, సలీం, మినాజ్, నాగూర్ భాషా, ఖాజా, రసూల్ మొహమ్మద్, అష్రఫ్, మౌలాలి, జంగీర్ జబ్బార్, బజారు నవీన్ గౌడ్, రంగుల శేఖర్ ముదిరాజ్, జుబేద్, మోసిన్, వాయద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కుతుబ్షాహీ ఉప్పల్ పెద్ద మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

# సోదరభావానికి ప్రతీక రంజాన్ పర్వదినం

◆ **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి,మార్చి14(తెలంగాణ ముచ్చట్లు):** పవిత్ర రంజాన్ మాసం సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లిం లందరూ రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.అలాగే పలువురికి రంజాన్ తోఫాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సౌభ్రాత్రృత్వం పెంపొందించే పండుగగా రంజాన్ ప్రత్యేక స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు. ఉపవాసం ద్వారా ఆత్మ నియంత్రణ పెరగడంతో పాటు పేదల పట్ల సానుభూతి కూడా పెంపొందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతోందని చెప్పారు.ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, సహకారంతో సమాజ అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం మరియు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజహిద్, ముస్లిం మత పెద్దలు అఫ్జాలుద్దీన్, రహీం, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్ఎఫ్‌సి బ్రిడ్జి విస్తరణకు 16న ధర్నా

◆ **మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో నిరసనకు సీపీఎం పిలుపు**

**మల్లాపూర్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్ర సర్కిల్ పరిధిలోని ఎన్ఎఫ్‌సి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ)ను తక్షణమే విస్తరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభమైన తర్వాత ఈ మార్గంలో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయని సీపీఎం కాప్ర సర్కిల్ కమిటీ కార్యదర్శి జి. శ్రీనివాసులు తెలిపారు.ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ఉద్యోగులు,విద్యార్థులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాల ముప్పు కూడా పెరిగిందని, ట్రాఫిక్ రద్దీ కారణంగా అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలు సకాలంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల సౌకర్యం, భద్రత దృష్ట్యా ఎన్ఎఫ్‌సి రైల్వే ఓవర్ బ్రిడ్జి విస్తరణకు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి మార్చి 16న సోమవారం సాయంత్రం 5 గంటలకు మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.స్థానికులు, వాహనదారులు, వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.





# అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన తాటి వెంకటేశ్వర్లు

**దమ్మపేట, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):-** దమ్మపేట మండలం గండుగులపల్లీ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన విద్యార్థులను శనివారం బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై అక్కడ ఉన్న వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల భోజనశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న నిత్యావసర సరుకులను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంతో పాటు వారిని కన్నబిడ్డలుగా చూసుకోవాలని వార్డెన్‌కు, మిడ్‌డే మీల్స్ సిబ్బందికి సూచించారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పాఠశాలల్లో వరుసగా ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. గత కొద్ది నెలల్లో సుమారు 90 పాఠశాలల్లో జరిగిన ఘటనల్లో 127 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, వందలాది మంది అస్వస్థతకు గురవడం సంక్షేమ హాస్టళ్ల అధ్వాన పరిస్థితికి నిదర్శనమని అన్నారు. అలాగే అశ్వారావుపేట నియోజకవర్గంలో కూడా దాదాపు 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, విద్యార్థుల ప్రాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గంగారం గ్రామంలో నేడు విద్యుత్ అంతరాయం.!



- మరమ్మత్తు పనుల కారణంగా సరఫరా నిలిపివేత.
- వినియోగదారులు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి.

**సత్తుపల్లి, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి రూరల్ విద్యుత్ విభాగం పరిధిలోని 11 కేవీ గంగారం ఫీడర్లో నేడు (మార్చి 15) నిర్వహించనున్న మరమ్మత్తు పనుల కారణంగా గంగారం గ్రామంలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ మరమ్మత్తు పనులు కొనసాగనున్నందున ఆ సమయంలో గంగారం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వ్యవస్థను మెరుగుపరచడం మరియు భవిష్యత్తులో అంతరాయాలు తగ్గించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు వివరించారు. అందువల్ల ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది పనులు సజావుగా పూర్తి చేయడానికి గ్రామ ప్రజలు సహకరించాలని సత్తుపల్లి రూరల్ సెక్షన్ ఏఈ (ఆపరేషన్) విజ్ఞప్తి చేశారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కోసం స్థలం కేటాయించాలని వినతి



**జోగులాంబ గద్వాల,మార్చి14 (తెలంగాణ ముచ్చట్లు):** రాజోలి మండల కేంద్రంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని జైశ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ, ఎమ్మార్వో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఎస్ఐ కార్యాలయం సమీపంలో విగ్రహం ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

రాజోలి మండల కేంద్రంలో జైశ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు కోసం అనుకూలమైన స్థలం కేటాయించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింపుల గంగిరెడ్డి, ఉపసర్పంచ్ సంధ్య శ్రీరామ్ రెడ్డి, వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు. కార్యక్రమం గ్రామపంచాయతీ కార్యాలయంలోని కమిటీ హాల్లో నిర్వహించారు.

# న్యూ నరసింహనగర్ మసీదులో ఘనంగా రంజాన్ ఇఫ్తార్ విందు



**కాప్రా, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ మీర్పెట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని న్యూ నరసింహ నగర్ కాలనీ మసీదులో జావేద్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి కంటెస్టెడ్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేస్తూ, రంజాన్ మాసం మనుషుల మధ్య సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించే పవిత్రమైన కాలమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సహనం, పరస్పర గౌరవ భావాలు పెరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, ఉప్పల్ మైనారిటీ అధ్యక్షులు బద్రుద్దీన్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ముస్లిం పెద్దలు, యువకులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆలయ నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుంది..

- డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



**ఖమ్మం బ్యూరో, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు) :** వైరా మున్సిపాలిటీ నాలుగవ వార్డు పరిధిలోని రాజీవ్ నగర్‌లో ముత్యాలమ్మ తల్లి గుడి శంకుస్థాపన కార్యక్రమం భక్తి భావాలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్
కాపా చంద్రకళ మురళీకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ దేవత అయిన ముత్యాలమ్మ తల్లి ఆలయం నిర్మాణం ప్రాంత ప్రజల ఐక్యతకు, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఆలయం నిర్మాణం ద్వారా ప్రాంతంలో ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెరుగుతుందని, భక్తులు ప్రశాంతతతో ప్రార్థనలు చేసే పవిత్ర స్థలం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు .ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ, దేవాలయాలు సమాజంలో ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. ప్రజల సహకారంతో ముత్యాలమ్మ తల్లి ఆలయం నిర్మాణం త్వరగా పూర్తవాలని ఆకాంక్షించారు.అలాగే ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో వైరా ప్రాంతం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు వేముల రత్నాకర్ వీరబాబు యాదవ్ రాజీవ్ నగర్ ప్రజాప్రతినిధులు, భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఏప్రిల్ 14న బ్లూ బ్లాక్ గ్రీన్ కవాతు

- ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి




**హైదరాబాద్,మార్చి14(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో ఏప్రిల్ 14న మూడు డిమాండ్లతో బ్లూ, బ్లాక్, గ్రీన్ షర్ట్స్ కవాతు మరియు సభ నిర్వహించనున్నట్లు మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చీఫ్ పాట్రన్ పిడమర్తి రవి, పాట్రన్ సురేందర్ సన్నీ తెలిపారు.
సాయంత్రం నాలుగు గంటల నుంచి బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ, 125 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. వేలాది మంది పాల్గొనే ఈ కవాతు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పలు డిమాండ్లు తెలియజేయనున్నట్లు తెలిపారు.
తెలంగాణలో ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలని, ఎస్సీలకు 20 శాతం, బీసీలకు 42 శాతం, ముస్లింలకు మరియు గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ పదవులను ఈ సందర్భంగా ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా కొండల శ్రీనాథ్ రావు, అధ్యక్షుడిగా ఎండి రహీం, కన్వీనర్‌గా చందు నాయక్ నియమితులయ్యారు. మహిళా విభాగం చైర్మన్‌గా కోట ఉషారాణి, కన్వీనర్‌గా వరలక్ష్మి బాధ్యతలు చేపట్టనున్నారు. విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా బోరెల్లి సురేష్, కన్వీనర్‌గా జోగు గణేష్ నియమితులయ్యారు. యూత్ విభాగం కన్వీనర్‌గా నక్క మహేష్, అధ్యక్షుడిగా రింగు రాంబాబు బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్ర కన్వీనర్లుగా రాజు (వికారాబాద్), నక్క రమేష్ (పెద్దపల్లి), సంపత్ నియమితులయ్యారు. నగర కన్వీనర్‌గా జెర్రిపోతుల సాయన్న బాధ్యతలు స్వీకరించగా, కో కన్వీనర్లుగా పాలడుగు రమేష్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, మాదుగుల శివ, పిడమర్తి రాంబాబు, దేవరకొండ నరేష్ నియమితులయ్యారు.

# భావితరాలకు భరోసా జనసేన

## నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వీ



**స్టేషన్ ఘనపూర్, మార్చి14(తెలంగాణ ముచ్చట్లు):**

భావితరాల భవిష్యత్తుకు భరోసా జనసేనపార్టీ అని జనసేనపార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గాదె పృథ్వీ అన్నారు. పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా డివిజన్ కేంద్రంలోని ఛత్రపతి శివాజి చౌక్ వద్ద పార్టీ జండావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అవినీతి రహిత పాలనే జనసేన నినాదమన్నారు.అధినేత పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితో చేస్తున్న పాలన దేశం గర్విస్తుందని తెలిపారు. జనసేన నిజాయితీకి జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తున్నారు. ఈ స్ఫూర్తితో నియోజకవర్గంలో జనసేన బలోపేతం చేస్తామన్నారు. ఏడేళ్లుగా ప్రజల మధ్య ఉంటూ అనేక ప్రజా సమస్యలపై పోరాడినట్లు తెలిపారు.యువతను ఏకం చేస్తూ రాజకీయాల్లో మార్పుకై జనసేన కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆమంచ సునీల్,మొహమ్మద్ రజాక్,కొలిపాక వంశీ కృష్ణ,రాజోజు రాజశేఖర్, మేడిద ప్రశాంత్ రెడ్డి,జనసైనికులు రాజోజు సాయి చరణ్, అక్కనపెల్లి సాయి,గాదె వినయ్,అంగిడి శ్రీనివాస్, సిద్ధు తదితరులు ఉన్నారు

# ఆశల లైన్లలో నిలిచిన దేశం...

దేశం దూసుకుపోతోందని
వేదికలపై మాటలు గాలి చీల్చుకుంటూ పరిగెడుతున్నాయి
కాని మా గూడెం దుమ్ము దారుల్లో మాత్రం
ఇప్పటికీ ఆకలి అడుగుల ప్రతిధ్వనియే మారుమోగుతోంది.
యుద్ధాలు మ్యాప్‌ల మీద గీసిన గీతలు
మా కడుపుల మీద గాయాలై పడుతున్నాయి
వాళ్లు సరిహద్దుల్లో తుపాకులు పేలుస్తుంటే
మా ఇళ్లలో ఆకలి గిన్నెలు గర్జిస్తున్నాయి.
సరిహద్దుల్లో గన్ శబ్దం
ఇక్కడ స్టౌవ్ దగ్గర నిశ్శబ్దం.
పాలిటిక్స్ ఒక ఆటగా మారింది
మా బతుకులు మాత్రం పావులయ్యాయి
వాళ్లు వేదికలపై గెలుపు జెండాలు ఊపుతుంటే
మా గడపల దగ్గర మాత్రం
నిరాశల ధూళి చేరి కూర్చుంటోంది.
ఎవరు అధికారంలోకి వచ్చినా
మా గోడలపై రాసే హామీల రంగు మాత్రమే మారుతుంది.
కానీ మా జీవితం మీద రాసిన దుఃఖం మాత్రం చెరగదు.
నోట్ల కోసం నిలబెట్టారు
మా గౌరవాన్ని ATM గోడలకు ఆనించి.
ఇప్పుడు గ్యాస్ కోసం నిలబెట్టారు
మా ఊపిరిని సిలిండర్ మూతకు కట్టి.
మారింది కేవలం సిలిండర్లే
కానీ మా దౌర్భాగ్యం కాదు.
కరోనా కాలంలో
ఆక్సిజన్ కోసం పరుగెత్తిన మా పాదాలు
ఇప్పుడు ఇంధనం కోసం
మళ్లీ రహదారుల పొడవున
మా అలసట రక్తమై కారుతోంది.
చెమటతో పండించిన అన్నం
ధరల బరువుకి తలవంచుతోంది
రైతు గుండె పగిలిన శబ్దం
స్టాక్ మార్కెట్ గ్రాఫ్‌లలో వినిపించదు.
పట్టణ వీధుల్లో వెలుగులు ఉప్పొంగి
రాత్రిని పండగలా మార్చేస్తుంటే
మా పల్లె గుడిసెల్లో మాత్రం
చిన్న దీపం ఇంకా నమ్మకమే తాగి వెలుగుతోంది.
వేదికలపై పెద్దల మాటల్లో
రేపటి దేశం బంగారు కలలా మెరిసిపోతుంది
కాని
మా చేతుల గీతల్లో మాత్రం
ఇప్పటికీ పగుళ్లతో నిండిన పాత్రల శబ్దమే మారుమోగుతోంది.
ప్రగతి రైలు దూసుకుపోతుందని చెబుతారు
కాని
మా టికెట్ ఇంకా వెయిటింగ్ లిస్ట్‌లోనే ఉంది.
మా ప్రయాణం ఇంకా
బతుకు పోరాటం దగ్గరే ఆగిపోయింది.
స్వాతంత్ర్యం వచ్చిందని జెండాలు ఎగురేస్తారు
కాని
మా ఆకలి మాత్రం ఇంకా సంకెళ్లలోనే తల్లడిల్లుతోంది.
దేశ సరిహద్దు కాపలా కాస్తున్న జవాన్లా
మా నాన్న కూడా
ఇంటి గడపను కాపాడుతూనే
కాలానికి మెల్లగా వంగిపోతున్నాడు.
రాజకీయాల వేదికపై
ఇప్పుడు ప్రగతి గళం వినిపించడం లేదు
కులం అనే గీతలతో నేలను చీల్చుతున్నారు
మతం అనే గోడలతో మనసుల్ని విభజిస్తున్నారు
దేవుని పేరును నినాదంగా ఎత్తి
వీధుల్ని ద్వేషపు పొగతో కమ్మేస్తున్నారు.
ఈ నేలపై
నిజం నిశ్శబ్దంగా మూలన కూర్చుంటే
నినాదాలు మాత్రం గాలిలో పిడుగుల్లా గర్జిస్తున్నాయి.
ఇక్కడ
రక్తం కారిన గాయాల కంటే
జెండాల రంగులకే ఎక్కువ వెలుగు ఇస్తారు.
మనిషి ప్రాణం కంటే
ప్రతీకల ప్రతిష్ఠే పెద్దదైపోతోంది.
ఒకరోజు
ఈ మౌనం మంటగా మారే రోజు వస్తుంది
అప్పుడు
దేశాన్ని కదిలించేది నినాదాల ప్రతిధ్వని కాదు
బాధలతో మండిపోయిన గుండెల తిరుగుబాటు గర్జనే.
అప్పటివరకు
మేము బతుకుతూనే ఉంటాం
లైన్లలో నిలబడి
ఆశల్ని చేతిలో పట్టుకుని
రేపు అనే పదం మీద
నమ్మకం కోల్పోకుండా.



- బసడ సంపత్ యాదవ్ 7032132593

# ‘వనరాణి మినీ ట్రైన్’ పునఃప్రారంభం

- **పర్యాటకానికి కొత్త ఊపునిచ్చే ప్రయత్నం**
- **పర్యావరణ హిత బ్యాటరీ ఇంజిన్‌తో ఆధునికీకరణ**
- **ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**

**ముంబై, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** : ముంబైలోని సంజయ్ గాంధీ నేషనల్ పార్క్‌లో ‘వనరాణి మినీ ట్రైన్’ పునఃప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మహారాష్ట్ర అటవీ శాఖ మంత్రి గణేష్ నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. పర్యాటకులను ఆకర్షించే ఈ ప్రత్యేక మినీ ట్రైన్ సేవను ఆధునికీకరించి మళ్లీ ప్రారంభించడం పార్క్ అభివృద్ధిలో ముఖ్యమైన అడుగుగా అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు మినీ ట్రైన్‌ను ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పర్యావరణానికి హాని కలగకుండా బ్యాటరీ ఆధారిత శక్తి సామర్థ్యంతో పనిచేసే కొత్త ఇంజిన్‌ను ఇందులో ఏర్పాటు చేశారని వివరించారు. అలాగే ఆధునిక కోచ్‌లు, ట్రాక్ పరిసరాల్లో అందమైన ల్యాండ్‌స్కేపింగ్, అలంకరణ పనులు చేపట్టడం ద్వారా ప్రయాణికులకు మరింత ఆకర్షణీయ అనుభవం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సంజయ్ గాంధీ నేషనల్ పార్క్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రకృతి సంరక్షణతో పాటు అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుతూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు.








# ఇరాక్‌లో విమాన ప్రమాదం.. అమెరికా వైమానిక దళ అధికారి మృతి

- **కేసీ–135 స్ట్రాటోట్యాంకర్ విమానం కూలిపోవడంతో విషాదం**
- **మొత్తం ఆరుగురు సిబ్బంది మృతి చెందిన ఘటన**
- **పైలట్ అరియానా బూషే మరణంపై సంతాపం**

**బాగ్దాద్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమ ఇరాక్‌లో జరిగిన విమాన ప్రమాదంలో అమెరికా వైమానిక దళానికి చెందిన పైలట్ ఫస్ట్ లెఫ్టినెంట్ అరియానా ఎ. బూషే మృతి చెందినట్లు సమాచారం. కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ విమానం కూలిపోవడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న మొత్తం ఆరుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. సైనిక విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం అమెరికా వైమానిక దళాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఫస్ట్ లెఫ్టినెంట్ అరియానా బూషే తన సేవా కాలంలో ఎంతో నిబద్ధతతో పనిచేసిన అధికారిగా గుర్తింపు పొందారు. ఆమెకు విమానయానంపై అపారమైన ఆసక్తి ఉండేదని, విధి నిర్వహణలో ఎంతో అంకితభావంతో పనిచేసేవారని సహచరులు గుర్తుచేసుకున్నారు. విమాన ప్రమాదం ఎలా జరిగింది అనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. సైనిక విధుల్లో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి అమెరికా వైమానిక దళ అధికారులు నివాళులర్పించారు. అరియానా బూషే మృతి పట్ల సహచరులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రతి కాల్ సైన్ వెనుక ఒక వ్యక్తి జీవితం, కుటుంబం, కలలు ఉంటాయని గుర్తుచేసుకుంటూ ఆమెకు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# గ్యాస్ కొరత వేళ బ్లాక్ మార్కెటింగ్‌పై చర్యలు

- **ఆరుగురు అరెస్ట్ – 24 మందిపై కేసులు నమోదు**
- **గ్యాస్ గోదాంలలో విస్తృత సోదాలు**
- **హార్ముజ్ సంక్షోభం పేరుతో అక్రమ విక్రయాలు**



**లక్నో, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** గ్యాస్ కొరత నేపథ్యంలో బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వారిపై ఉత్తరప్రదేశ్ ఆహార, పౌర సరఫరాల శాఖ కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సోదాల్లో ఆరుగురిని అరెస్ట్ చేసి 24 మందిపై కేసులు నమోదు చేశారు. పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా హార్ముజ్ జలసంధి గుండా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడినట్లు వార్తలు రావడంతో దేశంలో గ్యాస్ కొరతపై పుకార్లు వ్యాపించాయి. ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని చెబుతున్నప్పటికీ ప్రజల్లో ఆందోళన పెరగడంతో గ్యాస్ సిలిండర్లకు డిమాండ్ అధికమైంది. ఈ పరిస్థితిని కొందరు డిస్ట్రిబ్యూటర్లు మరియు మధ్యవర్తులు ఆసరాగా చేసుకుని గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అధిక ధరలు చెల్లించిన వారికి గ్యాస్ సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో లక్నో నగరంలో మొత్తం 1,483 ప్రాంతాల్లో ఆహార, పౌర సరఫరాల శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇందులో నాలుగు కేసులు గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లపై, మరో 20 కేసులు ఇతర వ్యక్తులపై నమోదు చేశారు. మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని ఉత్తరప్రదేశ్ ఆహార, పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది. పుకార్లను నమ్మవద్దని ప్రజలకు సూచిస్తూ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# గ్రీన్ కార్డుల కోసం చోరీల డ్రామా

- **అమెరికాలో 11 మంది భారతీయులు అరెస్ట్**
- **యూ వీసా కోసం దోపిడీ కథలు సృష్టించిన ముఠా**
- **పలు రాష్ట్రాల్లో దర్యాప్తు కొనసాగింపు**




**వాషింగ్టన్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికాలో అక్రమంగా నివసిస్తూ వీసా మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై 11 మంది భారతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రీన్ కార్డులు పొందేందుకు చోరీలు జరిగాయన్నట్లు నాటకాలు ఆడినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు.
దోపిడీ ఘటనల్లో తాము బాధితులమని కట్టుకథలు అల్లి యూ వీసా పొందేందుకు ప్రయత్నించినట్లు అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. హింసాత్మక నేరాల్లో బాధితులైన విదేశీయులు అమెరికాలో చట్టబద్ధంగా ఉండేందుకు యూ వీసాకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ వీసా ద్వారా వలసదారులకు పని అనుమతులు లభించడంతో పాటు కొన్ని సంవత్సరాల తరువాత గ్రీన్ కార్డు పొందే అవకాశం ఉంటుంది.
ఈ నిబంధనను ఆసరాగా చేసుకుని కొందరు వలసదారులు మోసాలకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మసాచుసెట్స్, కెంటకీ, ఒహాయో తదితర రాష్ట్రాల్లో 11 మంది భారతీయులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరిలో ఒకరిని భారత్‌కు డిపోర్ట్ చేయగా మరో ఆరుగురిని కోర్టులో హాజరుపరచి విడుదల చేశారు. మిగతా నలుగురిని రిమాండ్‌లో ఉంచారు. నిందితులు ముఠాగా ఏర్పడి ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు, ఇతర స్టోర్ల వద్ద దోపిడీలు జరిగినట్లు చూపించి తరువాత తాము బాధితులమంటూ యూ వీసాలకు దరఖాస్తు చేసే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో నేరం నిరూపితమైతే నిందితులకు ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 2.5 లక్షల డాలర్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఇరాన్ యుద్ధనౌక సిబ్బందిని వెనక్కి పంపిన భారత్

- **కొచ్చిలో నిలిచిన ఐరిస్ లావన్ నౌక**
- **అత్యవసరం కాని సిబ్బంది ప్రత్యేక విమానంలో స్వదేశానికి**
- **శ్రీలంక సమీపంలో దాడిలో మరణించినవారి మృతదేహాలు తరలింపు**



**కొచ్చి, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక ఐరిస్ లావన్‌లో ఉన్న అత్యవసరం కాని సిబ్బందిని భారత్ వెనక్కి పంపింది. ఈ నెల 1న ఇరాన్‌కు చెందిన ఈ యుద్ధనౌకలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఇరాన్ ప్రభుత్వం భారత్‌ను సంప్రదించింది. దీనికి స్పందించిన భారత్ మానవతా దృక్పథంతో నౌకను కొచ్చి పోర్టులో లంగరు వేసేందుకు అనుమతించింది. ఆ తర్వాత ఈ నెల 4 నుంచి ఐరిస్ లావన్ నౌక 183 మంది సిబ్బందితో కొచ్చి తీరంలోనే నిలిచింది. నౌకలో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరం లేని సిబ్బందిని వెనక్కి పంపే నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నౌకలో ఉన్న అత్యవసరం కాని సిబ్బందిని ప్రత్యేక విమానంలో ఇరాన్‌కు తరలించారు. ప్రస్తుతం ఐరిస్ లావన్ నౌకలో సుమారు 50 మంది అత్యవసర సిబ్బంది మాత్రమే మిగిలి ఉన్నారని సమాచారం. వీరు నౌక మరమ్మతులు మరియు అవసరమైన సాంకేతిక పనులు పూర్తయ్యే వరకు కొచ్చిలోనే ఉండనున్నారు. ఆ తర్వాత పరిస్థితులు అనుకూలిస్తే మిగిలిన సిబ్బంది కూడా స్వదేశానికి చేరుకునేలా ఏర్పాట్లు చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా ఈ నెల 4న శ్రీలంక సమీప సముద్ర జలాల్లో జరిగిన దాడిలో మునిగిపోయిన మరో ఇరాన్ యుద్ధనౌకలో పలువురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. ఆ ఘటనలో మరణించిన సిబ్బందిలో గుర్తించిన 80 మంది ఇరానీయుల మృతదేహాలను స్వదేశానికి తీసుకెళ్లేందుకు ఇరాన్ ప్రత్యేక విమానాన్ని పంపింది. కొలంబో నుంచి మృతదేహాలను తీసుకువచ్చిన ఆ విమానం శుక్రవారం రాత్రి కొచ్చి విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడి నుంచి అవసరమైన ప్రక్రియలు పూర్తయ్యాక ఆ మృతదేహాలను ఇరాన్‌కు తరలించారు. ఇక ఐరిస్ లావన్ నౌకలో మిగిలిన సిబ్బంది కూడా త్వరలోనే ఆర్మేనియా రాజధాని యెరెవాన్‌కు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా ఇరాన్‌కు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మొత్తం ఘటన నేపథ్యంలో కొచ్చి పోర్టులో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిణామాలు పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రాంతంలోకి దూసుకెళ్లిన ఎద్దు

- **బీహార్‌లో ముఖ్యమంత్రి పర్యటనలో కలకలం**
- **ల్యాండింగ్‌కు ముందు హెలిప్యాడ్ వద్ద అప్రమత్తమైన పోలీసులు**
- **భద్రతా ఏర్పాట్ల మధ్య తాత్కాలిక గందరగోళం**

**బేగుసరాయ్, మార్చి 14 (తెలంగాణ ముచ్చట్లు):** బీహార్ రాష్ట్రంలోని బేగుసరాయ్ జిల్లాలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పర్యటన సందర్భంగా అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగాల్సిన ప్రదేశంలోకి ఒక్కసారిగా ఓ ఎద్దు దూసుకురావడంతో అక్కడ కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి రాకకు కొద్దిసేపటి ముందు ఈ ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపింది. హెలిప్యాడ్ వద్ద ఇప్పటికే పోలీసులు, భద్రతా సిబ్బంది భారీగా మోహరించి ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఒక్కసారిగా ఎద్దు హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రాంతంలోకి ప్రవేశించడంతో అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎద్దును అక్కడి నుంచి తరిమేందుకు పోలీసులు పరుగులు తీస్తూ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడినప్పటికీ, పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని హెలిప్యాడ్ పరిసరాలను మళ్లీ ఖాళీ చేశారు. అనంతరం భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేసి ముఖ్యమంత్రి రాకకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.




చివరికి పరిస్థితి పూర్తిగా అదుపులోకి రావడంతో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పర్యటన యథావిధిగా కొనసాగింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బాలీవుడ్‌లో కీర్తి సురేష్ కొత్త ప్రాజెక్ట్.. రాజ్‌కుమార్ రావుతో థ్రిల్లర్

బాలీవుడ్‌లో దక్షిణాది నటి కీర్తి సురేష్ మరో భారీ ప్రాజెక్ట్‌ను అందుకున్నారు. బాలీవుడ్ ప్రముఖ నటుడు రాజ్‌కుమార్ రావుతో కలిసి ఆమె తొలిసారిగా వెండితెరపై కనిపించనున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'రఫ్తార్'.

ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని రాజ్‌కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన నిర్మాణ సంస్థపై ప్రముఖ స్టూడియో సమర్పణలో నిర్మిస్తున్నారు. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, విజయాన్ని సాధించేందుకు ఇద్దరు వ్యక్తులు చేసే పోరాటం నేపథ్యంలో ఈ కథ సాగనుంది. డబ్బు మరియు అధికారం మనుషుల సంబంధాలను ఎలా మార్చుతాయనే అంశాన్ని ఈ చిత్రంలో ప్రధానంగా చూపించబోతున్నారు.

ఈ చిత్రానికి ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో ఆయన రూపొందించిన 'సెక్టార్ 36' చిత్రం మంచి ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో రాజ్‌కుమార్ రావు, కీర్తి సురేష్‌లతో పాటు అనురాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా, రజత్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

జాతీయ అవార్డు అందుకున్న రాజ్‌కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తున్నందున ఈ సినిమాపై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



# రాజకీయ చదరంగం మళ్లీ మొదలు.. 'సర్కార్ 4' ప్రకటించిన రామ్ గోపాల్ వర్మ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన ప్రసిద్ధ రాజకీయ క్రైమ్ ఫ్రాంచైజీ 'సర్కార్' నుంచి నాలుగో భాగాన్ని అధికారికంగా ప్రకటించారు. ముంబైలో జరుగుతున్న రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'సర్కార్ 4' చిత్ర పనులను వచ్చే నెల నుంచే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 2005లో అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రలో వచ్చిన 'సర్కార్' చిత్రం భారీ విజయాన్ని సాధించింది. అనంతరం 2008లో 'సర్కార్ రాజ్', 2017లో 'సర్కార్ 3' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఇప్పుడు దాదాపు తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఈ సిరీస్‌లో నాలుగో భాగం తెరకెక్కనుండటంతో సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. ఈ సందర్భంగా వర్మ తన మరో ప్రాజెక్ట్ 'ది సిండికేట్' గురించి కూడా ప్రస్తావించారు. అలాగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో తన క్లాసిక్ హిట్ చిత్రం 'శివ' ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్న ఆయన, ఆ సినిమా నిర్మాణంపై హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ ప్రభావం ఉందని గుర్తుచేశారు.

ప్రస్తుతం ఉన్న యువ దర్శకుల్లో ఆదిత్య ధర్ ప్రతిభావంతుడని వర్మ ప్రశంసించారు. వచ్చే నెలలో చిత్రీకరణ ప్రారంభం కానున్న 'సర్కార్ 4'లో అమితాబ్ బచ్చన్ మళ్లీ సుభాష్ నాగ్రే పాత్రలో ఎలా కనిపించబోతున్నారో అన్నదానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.





# డిఫరెంట్ కాన్సెప్ట్‌తో హెబ్బా పటేల్ కొత్త సినిమా ప్రారంభం

టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించిన హీరోయిన్లలో హెబ్బా పటేల్ ఒకరు. తక్కువ సమయంలోనే మంచి అభిమాన వర్గాన్ని ఏర్పరచుకున్న ఆమెకు ఆశించిన స్థాయిలో స్టార్‌డమ్ మాత్రం దక్కలేదు. అయితే ఇటీవల లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు, విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాజాగా హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో ఓ కొత్త సినిమా ప్రారంభమైంది. అర్జున్ ఆర్ట్స్ సమర్పణలో చిత్రాలయ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీలక్ష్మి.ఎం నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రొడక్షన్ నెంబర్ మూడు గా రూపొందుతోంది. 'దర్జా' చిత్రంతో గుర్తింపు పొందిన మ్యాక్ (సలీం మాలిక్) ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భావోద్వేగాలు, వినోదం కలగలిపిన వినూత్న కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి మాటలు, పాటలను భాష్యశ్రీ అందిస్తున్నారు. అదనపు స్క్రీన్‌ప్లేను కె.వి.ఆర్ రచించారు. సంగీతాన్ని ఎం. సమీర్ సమకూర్చుతుండగా, ఛాయాగ్రాహకుడిగా విష్ణు పానికర్ పని చేస్తున్నారు. ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు. హెబ్బా పటేల్ సినీ ప్రయాణం విషయానికి వస్తే 2014లో తమిళ చిత్రంతో ఆమె సినీరంగంలోకి అడుగుపెట్టారు. అదే ఏడాది తెలుగులో 'అలా ఎలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అనంతరం 2015లో విడుదలైన 'కుమారి 21ఎఫ్' చిత్రం ఆమెకు మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత 'ఈడోరకం ఆడోరకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'నాన్న నేను నా బాయ్‌ఫ్రెండ్స్', 'అలా నిన్ను చేరి', 'ఓదెల రైల్వే స్టేషన్' వంటి చిత్రాల్లో నటించారు. ఇప్పుడు కొత్త కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# విజయ్ దేవరకొండ పాత ట్వీట్ వైరల్




టాలీవుడ్ సెన్సేషనల్ జంటగా భావిస్తున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న గురించి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వీరిద్దరి వివాహంపై వస్తున్న వార్తలు వైరల్ అవుతున్న నేపథ్యంలో ఎనిమిదేళ్ల క్రితం విజయ్ దేవరకొండ చేసిన ఒక పాత ట్వీట్ ఇప్పుడు మరోసారి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అప్పట్లో సరదాగా చేసిన ఆ వ్యాఖ్య ఇప్పుడు నిజం కావొచ్చని అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించిన చిత్రం 'గీత గోవిందం'. ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడిందని అప్పటినుంచే వార్తలు వినిపిస్తున్నాయి. అప్పటి నుంచి వారి మధ్య ఉన్న అనుబంధంపై తరచూ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. 2018 జూన్ 23న 'గీత గోవిందం' సినిమా ప్రచార కార్యక్రమాల సందర్భంగా విజయ్ దేవరకొండ ఒక ట్వీట్ చేశారు. సినిమాలో రష్మికను భుజాన ఎత్తుకుని నడిచే సన్నివేశాన్ని ఉద్దేశిస్తూ "నా కాళ్లు తిమ్మిరి ఎక్కినా, నడుము నొప్పి వచ్చినా మీ బరువు బాధ్యత ఎప్పుడూ నాదే మేడమ్" అని రాసుకొచ్చారు. అప్పట్లో ఈ ట్వీట్‌ను కేవలం సినిమా ప్రచారంలో భాగంగా చేసిన సరదా వ్యాఖ్యగా భావించారు. అయితే ప్రస్తుతం వీరిద్దరి వివాహంపై వస్తున్న వార్తల నేపథ్యంలో ఆ పాత ట్వీట్‌ను నెటిజన్లు మళ్లీ వెలికితీసి పంచుకుంటున్నారు. "అప్పుడే మాట ఇచ్చేశావా విజయ్?" అంటూ సరదాగా వ్యాఖ్యలు చేస్తున్నారు. దీంతో ఆ ట్వీట్ మళ్లీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇటీవల విజయ్ దేవరకొండ తన స్వగ్రామంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించడం, గ్రామస్తులకు అన్నదానం చేయడం వంటి ఫోటోలు కూడా వైరల్ అయ్యాయి. ఆ తర్వాత వీరిద్దరి వివాహంపై ఊహాగానాలు మరింత పెరిగాయి. అయితే అప్పట్లో సరదాగా చేసిన ట్వీట్ ఇప్పుడు అభిమానుల దృష్టిలో ఒక అందమైన ప్రేమకథకు సూచనగా మారిందని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# లిప్ లాక్ సన్నివేశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన మృణాల్ ఠాకూర్

సినీ రంగంలో అవకాశాల కోసం హీరోయిన్లు ఎదుర్కొనే సవాళ్లు ఎన్నో ఉంటాయి. కెరీర్ ప్రారంభ దశలో చేసిన కొన్ని పాత్రలు వారి భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపుతుంటాయి. ఇలాంటి అనుభవాల గురించి ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ గతంలో ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

నటనపై ఆసక్తితో సాధారణ కుటుంబం నుంచి సినీ రంగంలోకి వచ్చిన మృణాల్ ఠాకూర్ మొదట బుల్లితెరపై సీరియల్స్ ద్వారా గుర్తింపు పొందారు. తర్వాత నెమ్మదిగా సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ వెండితెరపై అవకాశాలు అందుకున్నారు.

తన కెరీర్ ప్రారంభ దశలో ఒక సినిమాలో హీరోతో లిప్ లాక్ సన్నివేశంలో నటించాల్సి రావడంతో తన తల్లిదండ్రులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. ఆ తర్వాత ఇకపై అలాంటి సన్నివేశాల్లో నటించకూడదని తనకు షరతు పెట్టారని, తాను కూడా కొంతకాలం ఆ నిర్ణయాన్ని పాటించానని చెప్పారు.

అయితే రొమాంటిక్ సన్నివేశాలు చేయనని చెప్పడంతో అనేక సినిమా అవకాశాలు కోల్పోయానని మృణాల్ వెల్లడించారు. చివరకు తల్లిదండ్రులను ఒప్పించి తర్వాతి సినిమాల్లో అలాంటి సన్నివేశాల్లో కూడా



నటించానని ఆమె చెప్పారు.

హిందీ బుల్లితెరలో ప్రసిద్ధి పొందిన 'కుంకుమ భాగ్య' సీరియల్ ద్వారా మృణాల్ ఠాకూర్ మంచి గుర్తింపు పొందారు. అనంతరం 'లవ్ సోనియా' చిత్రంతో కథానాయికగా సినీ రంగంలోకి అడుగుపెట్టారు. తరువాత పలు కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో నటిస్తూ తన ప్రతిభను నిరూపించారు.

తెలుగులో దుల్కర్ సల్మాన్ సరసన నటించిన 'సీతారామం' చిత్రంతో ఆమెకు మంచి పేరు వచ్చింది. ఆ చిత్రం విజయంతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. అనంతరం 'హాయ్ నాన్న', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం అడివి శేష్ సరసన 'డెకాయిట్' చిత్రంలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in